

విద్యార్థులు, గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని గుమ్మకోట పంచాయతీ పరిధి పలు గ్రామాల్లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పాగి. అప్పారావు ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గుమ్మకోట గురుకుల పాఠశాలలో మంది విద్యార్థులు, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీంపోలు ఎంపిటిసి శిరిగం అశోక్. గుమ్మ కోట పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

డబ్బులున్నాయ్.. ఖర్చు చేయరేం?

- ఏజెన్సీకి రూ.88 కోట్లు ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ నిధులు
- వచ్చే ఏడాది మార్చి 31 ఖర్చుకు గడువు
- కల్వర్టులు నిర్మిస్తే గిరిజనులకు తీరనున్న కొన్ని కష్టాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాడేరు డివిజన్‌కు సంబంధించిన ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.88 కోట్లు ఉన్నాయి. ఈ నిధులు వచ్చే ఏడాది మార్చి 31లోపు ఖర్చు చేయకపోతే వెనక్కువెళ్లిపోనున్నాయి. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ నిధులను వినియోగించుకొనే అవకాశముంది. కానీ ఈ నిధులకు సరిపడా ప్రాధాన్యత కలిగిన పనులు పూర్తిచేసి గిరిజనులకు కొన్ని మౌలిక సదుపాయాలు కల్పిద్దామన్న ఆలోచన లేకపోవడం విచారకరం. అనుసంధాన రహదారులు, కల్వర్టులు లేక తుపాను, భారీ వర్షాలు సంభవించినప్పుడు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోవడంతో కనీస అవసరాలకు తీర్చుకోలేక, అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లాల్సివచ్చినప్పుడు, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకెళ్లున్నప్పుడు గిరిజనులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో వీరంతా చూస్తున్నా.. వారి బాధలు పట్టడంలేదు. రహదారులకు నిధులు మంజూరు చేయాలని జిల్లా పరిషత్ సమావేశంలో ఏజెన్సీ 11 మండలాల్లోని జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు అడుగుతూనేవున్నారు. ఖర్చు చేయాల్సిన రూ.88 కోట్ల ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకుందామన్న సదాలోచన ప్రభుత్వ యంత్రాంగానికి రాలేదు. గత నెల 26న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఏజెన్సీకి సంబంధించి ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.88 కోట్లు సిద్ధంగా ఉన్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ తెలియజేశారు. అయినా ఇంతవరకు ఆ నిధులు సద్వినియోగం చేసుకొనేందుకు ఎవరూ ముందుకురావడంలేదు.

ఈ పరిస్థితి కొనసాగితే రూ.88 కోట్లు ఇతర జిల్లాల్లో జరిగిన పనులకు ప్రభుత్వం కేటాయించనుంది. మిషన్ కనెక్ట్ పాడేరు కింద ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున వంద కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపందాల్చక ముందే జిల్లాల విభజన జరగడంతో ఆ కార్యాచరణ ముందుకుసాగలేదు. ఆ ప్రతిపాదనలు అమలు జరిగేలా ఈ రూ.88 కోట్లను సద్వినియోగం చేసుకున్నా కొన్ని సదుపాయాలు గిరిజనులకు లభించేవి. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్‌లు ఎలాగూ ఉన్నాయి. ఇక మన్యంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.88 కోట్లను గిరిజనుల రోజువారీ ఇబ్బందులను తొలగించడానికి గాను కల్వర్టులు నిర్మించగలిగితే ఎంతో ఉపయోగకరంగా వుంటుంది. వర్షాలు, తుపానులు వచ్చిన ప్రతిసారీ గెడ్డల ప్రవాహం వల్ల రాకపోకలు స్తంభించడంతో ఎక్కడి గిరిజనులు అక్కడ కొన్ని రోజుల పాటు వుండిపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఈ నిధులను సరిపడా ప్రాధాన్యత క్రమంలో గిరిజనుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని కల్వర్టులైనా నిర్మించాలి. నీటి ప్రవాహం పెద్దగాలేనిచోట పైపు కల్వర్టులు,



ప్రవాహం ఎక్కువగా వున్న చోట స్లాబ్ కల్వర్టులు నిర్మించగలిగితే గిరిజనులకు రవాణా సౌకర్యం సులభమవుతుంది. తమ పంటలు ఇతర ప్రాంతాల్లో విక్రయించుకొనేందుకు, నిత్యావసర సరుకులు, నిర్మాణ సామగ్రి తెచ్చుకొనేందుకు, ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇంతవరకు ఉన్నటువంటి కష్టాలు కొంతైనా తొలగనున్నాయి. కల్వర్టులు నిర్మించగలిగితే అక్కడ నుంచి గ్రామాలకు ఉపాధి హామీ వేతన నిధులతో రహదారులు ఏర్పాటు చేసుకొనే వీలుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి రాని నిధుల కోసం ఎదురుచూడకుండా, సిద్ధంగావున్న రూ.88 కోట్ల నిధులను మార్చి 31లోగా సద్వినియోగం చేసుకోగలిగితే గిరిజనులకు కొంతైనా మేలు జరుగుతుంది.

'నా భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయి'

- సమగ్ర విచారణ చేపట్టాలి
- మీడియాతో పెదబయలు తహశీల్దార్ శ్రీనివాసరావు భార్య

ప్రజాశక్తి-పెదబయలు:స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఉదయం మృతి చెందిన విజయం తెలిసిందే. మతిని భార్య లక్ష్మి శివ సరోజను ప్రజాశక్తి శుక్రవారం సంప్రదించగా.. తన భర్త మృతి పై పలు అనుమానాలున్నాయని ఆత్మహత్య చేసకునేంత పిరికి వారుకాదని తెలిపారు. కుటుంబం కోసం నిత్యం పరితపించే వారని హఠాత్తుగా ఆత్మహత్య చేసుకున్నాడని తెలియయడంతో షాక్‌కు గురయ్యానని ఆమె తెలిపారు. తన భర్త మృతి పై అనుమానాలు ఉండటంతో స్వంత జిల్లాకు మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తీసుకు వెళ్దామంటే అల్లూరి జిల్లా అధికారులు ఎంతమాత్రం ఒప్పు కొలేదని, బలవంతంగా పాడేరు సిహెచ్‌సికి తరలించి రాత్రి 8గంటల పోస్ట్‌మార్టం తరువాత మృతదేహాన్ని అప్పగించారన్నారు. తన భర్త ను హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నత అధికారులు దృష్టి సారించి సమగ్రమైన విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు.

స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్‌ను వివరణ కోరగా మృతిని భార్య పిర్యాదు మేరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేశామని, ఫోన్ కాల్స్ పరిశీలిస్తున్నామని తెలిపారు

తహశీల్దార్ మృతిపై కలెక్టర్, పిఒ సంతాపం

ప్రజాశక్తి-పాడేరు:పెదబయలు తహశీల్దార్ శ్రీనివాసరావు మృతికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. పెదబయలు తహశీల్దార్ ఒ. శ్రీనివాసరావు గురువారం మృతి చెందిన విషయం విధితమే. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సంయుక్త కలెక్టర్ శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్ఓ బి దయానిది తదితరులు గురువారం సాయంత్రం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

మృతదేహానికి పోస్టుమార్టం

- కుటుంబ సభ్యులకు అప్పగింత
- విజయనగరం జిల్లాకు తరలింపు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పెదబయలు మండల తహసీల్దార్ ఓ శ్రీనివాసరావు మృతదేహానికి గురువారం రాత్రి పాడేరు జిల్లా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం పూర్తి చేసినట్లు పాడేరు మండల తహసిల్దార్ వంజంగి త్రినాధరావు తెలిపారు. శ్రీనివాసరావు పెదబయలు మండల కేంద్రంలోని తన నివాస గృహంలో గురువారం ఉదయం ఉరితాడుకు వేలాడుతూ మృతి చెందిన విషయం విధితమే. గురువారం సాయంత్రం శ్రీనివాస్ రావు భార్య బంధు వర్గం సమక్షంలో మృతదేహాన్ని పాడేరు తరలించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, తహశీల్దారు శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి, పిఒ, సబ్ కలెక్టర్ సమక్షంలో పోస్టుమార్టం పూర్తి చేశారు అనంతరం అధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాసరావు మృతదేహాన్ని అంబులెన్స్‌లో అనంతగిరి వరకు తరలించి అక్కడి నుంచి ఫ్రీజర్ లో మృతదేహాన్ని భద్రపరిచి కుటుంబ సభ్యులకు అప్పగించి స్వస్థలం విజయనగరానికి తరలించినట్లు పాడేరు తహసీల్దార్ తెలిపారు.



ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీలపై వేధింపులు మానుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-అడ్డతీగల

అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులు మానుకోవాలని కోరుతూ స్థానిక సిడిపిఓ కార్యాలయం వద్ద అడ్డతీగల, వై.రామవరం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల ఒత్తిడితో టెన్షన్‌కు గురైన మృతి చెందిన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ ప్రాజెక్టులోని మృతి చెందిన అంగన్వాడీకు ప్రగాఢ సంతాపం తెలియజేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సిడిపిఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ అడ్డతీగల ప్రాజెక్టు అధ్యక్షురాలు బేబీ, జిల్లా కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు అనేక రూపాల్లో సేవలు అందిస్తున్న అంగన్వాడీలపై వేధింపులు సరికాదని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి నెల వచ్చేసరికి కేంద్రాల అద్దెలు, వంట సామగ్రి, కూరగాయలు ఇలా అన్నింటికీ పెట్టుబడులు పెడుతూ కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి జీతం కూడా సకాలంలో అందని పరిస్థితి నెలకొందన్నారు. ఎంఎస్‌కె విజిట్లు, వాలంటీర్ విజిట్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిడిపివోలు విజిట్లు ఇలా ప్రతి ఒకరూ విజిస్టుల చేస్తూ అంగన్వాడీలను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ఎప్పుడు ఎవరు తనిఖీకి వస్తారో అని టెన్షన్‌కు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.



పాఠశాల మైదానంలో శుభ్రం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ పోలీసులు

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో సీలేరులో స్వచ్ఛయే సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రామాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెయిన్ బజార్ తదితర ప్రదేశాల్లో సీఆర్పీఎఫ్ పోలీసులు స్వయంగా చీపులతో ఊడ్చి చెత్తాచెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ సుందరం మాట్లాడుతూ గ్రామ పరిసరలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు బారి నుంచి దూరంగా ఉండొచ్చని సూచించారు. చెత్తరహిత సీలేరుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలని..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన భారీ ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మృత్యువాత కు గురయ్యారని, దీనిపై విచారణ జరిపి, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ కళాశాలలను తలపించే రీతిలో ప్రభుత్వ కళాశాలలో ఫీజులు వసూలు చేయడంతో గిరిజన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గిరిజన విద్యా సంస్థలలో హెల్త్ వాలంటీర్లను, ఏఎన్ఎంలను, వాచ్మెన్లలను నియమించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, దీంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం విద్యను దూరం చేస్తోందని.. విమర్శించారు. గిరిజన విద్యా సంస్థలలో కనీస మౌలిక వసతులు విద్యార్థులకు కరువ య్యాయని, ఇటువంటి పరిస్థితులలో విద్యను ఎలా అభ్యసిస్తారని ప్రశ్నించారు. భవిష్యత్తులో హాస్టల్, స్కూల్స్‌లో సర్వేలు చేస్తామని, సమస్యలు వెలుగులోకి తీసుకొస్తామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేధించే ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ అనంతరం గిరిజన విద్యార్థుల సమస్యలపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిన్నారావు, జీవన్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు



తుపాను ముప్పుతో ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:-మండూస్ తుఫాన్ ప్రభావంతో మండలంలోని 23 పంచాయతీ పరిధి గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.చేతికి అందిన పంట అందికొచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో గిరిజన రైతులు చినుకులు పడడంతో ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు కోసిన రైతులు తార్పాల్లిన్ కవర్లను మూసేందుకు నిమగ్నం అయ్యారు.

ఈ ఏడాది మండలంలోని విస్తారంగా వరి, రాగులు, సామాలు, రాజ్మా చిక్కుళ్ళు, చిరుధాన్యాలు పంట దిగుబడి అధికంగా వచ్చింది. ఈ సమయంలో పంట దెబ్బతింటే అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి ఉంటుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

హుకుంపేట: మండలంలోని పలుచోట్ల వర్షాలు పడుతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరగడంతో రైతులు భయపడుతున్నారు. సంవత్సరమంతా కష్టించి పండించిన పంట పొలాల్లో తడిస్తే ఆర్థికంగా నష్ట పోతామని రైతులు తెలిపారు.



స్వర్ణోత్సవ సంబరాలకు సర్వం సిద్ధం

నేడే పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -చింతూరు

చింతూరు డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలకు అంతా సిద్ధమైంది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు సన్నాహాలు పూర్తయ్యాయి. 1974లో ఏర్పాటైన ఈ పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటోంది. ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజులపాటు సంబరాలు జరగనున్నాయి. 1974 నుంచి 2022 వరకు ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు, బోధించిన గురువులు అందరూ ఒకే చోట అపూర్వ కలయికకు ఇది వేదిక కానుంది. రెండు సంవత్సరాలుగా స్వర్ణోత్సవ ఉత్సవాలకు అనేక సమావేశాలు నిర్వహించారు. అనేక ఆటంకాలను ఎదుర్కొని పట్టుదలతో విశ్రాంత ఉపాధ్యాయులు అంక ప్రసాద్ సూచనలతో కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమానికి విశ్రాంత గురువులు 70 మందిపైగా హాజరుకానున్నారు. వారికి గురుదక్షిణలు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వర్ణోత్సవ వేడుకల చిహ్నంగా చిరకాలం నిలిచిపోయేలా



ఆవిష్కరణకు సిద్ధం చేసిన ఠాగూర్, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే విగ్రహాలు



స్వర్ణోత్సవ సంబరాల ఆహ్వాన ముఖ ద్వారం

పైలాన్ ఏర్పాటు చేశారు. ఇదే పాఠశాలలో విధులు నిర్వహించిన పూర్వ ఉపాధ్యాయురాలు కీర్తిశేషులు బి.సరోజినీ దేవి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి రూ.3.50 లక్షలు విరాళం అందజేశారు. పాఠశాల సావినీర్‌ను తయారుచేసి అతిథుల సమక్షంలో ఆవిష్కరించనున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారికి భోజన సదుపాయాలు, వసతి ఏర్పాట్లు చేశారు. 1500 మంది పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. దేశ విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు మారుమూల మన్య ప్రాంతమైన చింతూరుకు విచ్చేసి తమ బాల్య కాలం నాటి తీపి గుర్తులను నెమరు వేసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో రవీంద్రనాథ్ ఠాగూర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి అమరులైన గురువుల చిత్రపటాలను ఆవిష్కరించనున్నారు. ఆహ్వాన ముఖద్వారాలు ప్రధాన ఆకర్షణగా ఉన్నాయి. ఈ స్వర్ణోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మనబడి స్వర్ణోత్సవ పూర్వ విద్యార్థుల కమిటీ కోరుతోంది.



అడుగడుగునా పహారా కాస్తున్న పోలీసులు

ఎఒబిలో రెడ్ అలర్ట్

విస్తృతంగా పోలీసు కూంబింగ్

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టులకు, పోలీసులు జరిగిన మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో పోలీసులు ఏఓబిలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. ఏఓబి సరిహద్దు తాడికోల అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు కూంబింగ్ చేస్తుండగా పోలీసు రాకను గమనించిన మావోయిస్టులు ఎదురుకాల్పులు జరిగాయి. ఇద్దరు మావోయిస్టులు చనిపోవడంతో ప్రతికార దాడులకు తప్పవని మావోయిస్టులు హెచ్చరించినట్లు పోలీస్ ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో పోలీసు బలగాల అప్రమత్తమై అదనపు బలగాలని మొహరించి మావోయిస్టుల అచూకీ కోసం గాలింపు చర్యలు ఉధృతం చేశారు. మావోయిస్టు ఇన్‌ఫార్మర్లపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం పోలీసు బలగాలు నిరంతరం పహారా కాస్తున్నారు. దీంతో ఏఓబి ఉన్న గిరిజనులు ఏ క్షణంలో ఏమీ జరుగుతుందోనని భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

పోలీసు శాఖలో ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి

- వయోపరిమితి పెంచాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అభ్యర్థులకు వయోపరిమితి 35 సంవత్సరాలకు పెంచాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే పోలీసు శాఖలో ఏడాదికి 6700 పోస్టులు చొప్పున భర్తీ చేస్తామని వైయస్సార్ ప్రభుత్వం వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. ఈ మేరకు లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని,నాలుగు సంవత్సరాలుగా నోటిఫికేషన్లు వెలువడలేదన్నారు. దీనికోసం సన్నద్ధమైన వేలాది మంది అభ్యర్థులకు వయో పరిమితి నిబంధన ఇబ్బందిగా మారిందని తెలిపారు. నోటిఫికేషన్ జాప్యంతో నిరుద్యోగులకు నష్టం జరుగకుండా ఉండాలంటే అభ్యర్థుల వయోపరిమితి 35 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.పోలీసు శాఖలో సుమారు వీక్లీ ఆఫ్ విధానంతో 10 వేల మంది సిబ్బంది అదనంగా అవసరమవుతారని తెలిపారు. ప్రభుత్వం కేవలం 6100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు.ఫైర్, జైలు వార్డెన్ తదితర పోస్టులను కూడా భర్తీ చేస్తే ఎక్కువ మంది సిబ్బంది అవసరమవుతారని, నాలుగేళ్ళుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ శిక్షణ తీసుకుంటున్న యువతకు న్యాయం జరుగుతుందన్నారు.

తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీలో తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే మండలంలోని అడవి వెంకన్నగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్న దృశ్య తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ బుచ్చమ్మ మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు వడ్లది రమేష్, కారం సుందరయ్య, అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి గ్రామ శివారు జాతీయ రహదారిపై జడ్డంగి ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాలు ఆపి నిశితంగా రికార్డులు పరిశీలించి, రికార్డులు సక్రంగాలేని పలు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను గూర్చి వాహనదారులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా జాతీయ రహదారిపై స్టాఫ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రసాద్ రెడ్డి దుర్గారావు ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.



రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మన్యంలో సీతాల పండగ సందడి

జోరందుకున్న వరి నూర్పులు ... కల్లాల్లో సంహఫంక్తి భోజనాలు


కల్లాల్లో ధాన్యం ఎగరబోస్తున్న రైతులు, ఇన్‌సెట్‌లో ధాన్యం రాశి

ప్రజాశక్తి-హుకుంపేట:మన్యంలో ప్రస్తుతం సీతాల పండుగ సందడి నెలకొంది.సంస్కృతి సాంప్రదాయాలకు కట్టుబడి ఏజెన్సీ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా సీతాల పండుగను గిరిజన రైతులు ఆనందంగా నిర్వహిస్తున్నారు.ఈ పండుగ వేళలో రైతులు వరి కోతలు కోసి చేలను కుప్పలు వేస్తున్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నూర్పులు జోరందుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా గిరిజన రైతులు పంట పొలాల్లో బిజీ బిజీగా ఉన్నారు.

వరి పంట నూర్పులు పూర్తి అయిన తర్వాత వచ్చిన ధాన్యాన్ని కళ్లలో పోగు చేసి ఎంతో సుందరంగా ఆవు పేడతో కల్లాపు చల్లుతారు. కొంత ధాన్యాన్ని బియ్యంగా మార్చి పరమాన్నం వండుతారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, చిన్నారులను కల్లాలకు ఆహ్వానిస్తారు. కుప్పగా పోసిన ధాన్యాన్ని ఎంతో చక్కగా పువ్వులు, మొగ్గలతో అలంకరించిస్తారు. కోతకు ఉపయోగించే కొడవల్లు, తదితర పరికరాలు ధాన్యం కుప్పలు చుట్టూరా ఉంచుతారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సంప్రదాయం ప్రకారం వారి కుల దేవతలను తలుసుకొని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. కొత్త బియ్యంతో వండిన అన్నాన్ని కళ్ల నికి వచ్చిన అందరికీ వడ్డిస్తారు. వచ్చిన వారు అందరూ కడుపు నిండా తిని రానున్న కాలంలో కూడా ఇబ్బందులు లేకుండా భగవంతుడు చల్లగా చూడాలని

కితలంగిలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి...'


ఇంటింటా ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని కితలంగి పంచాయతీ రంగిసింగిగుడ గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- అరకులోయ :అరకులోయలోని వాలీబాల్ గ్రౌండ్‌లో ఈనెల 10న యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐక్య క్రిస్మస్ వేడుకను విజయవంతం చేయాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వి.ప్రభుదాస్, కె.ఎలీషా, కె.ఎస్ బాబురావు, ఎస్.శ్యాం సన్, బిషప్. ఎంలివ్ విజయ్ డానియల్ మోజెస్ కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఐక్య క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, గౌరవ అతిథులుగా అరకులోయ జడ్‌పిటిసి శెట్టి రోష్ని, బిషప్. జే.ప్రసాద్‌రావు, రేవరెండ వి.ప్రసాద్ పాల్, కె.జాన్ ప్రకాష్, బి.ఇ.సంజీవ్ కుమార్, కే.శామ్యూల్, పి. షద్రక్ పాల్గొంటున్నారని తెలిపారు.వాక్యోపదేశకుడిగా జోయల్ జస్వంత్ గుమ్మడి (షమ్మా మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ హైదరాబాద్) హాజరు కానున్నారని, శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ భక్తులు పాల్గొనాలని కోరారు.క్రైస్తవ సంఘాలు, క్రైస్తవ ఐక్యవేదిక సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు వారు తెలిపారు.

బాలికల చదువుతో సమాజాభివృద్ధి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బాలికలు ఉన్నత చదువులతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సమాజంలో ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. మహిళలపై హింసలు నిర్మూలనపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత 15 రోజులుగా మహిళా చట్టాలు, హక్కులు, మహిళలపై హింస నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. బాలికలు బాగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే వ్యతిరేకించి, చదువు కొనసాగించాలని చెప్పాలన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలు తక్కువగా ఉంటాయని, మైదాన ప్రాంతాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తే సమాజం పట్ల మంచి అవగాహన ఉంటుందన్నారు. సామాజిక విషయాలు, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గురుకుల కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. బోరు నిర్మించుకుని బిల్లులు సమర్పిస్తే వెంటనే నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

అదనపు ఎస్‌పి (పరిపాలన) తుహిన్ సిన్హ మాట్లాడుతూ, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా హింసకు పాల్పడినా ప్రభుత్వపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నేరం నిర్మూలనకు అందరూ కృషి చేయాలని చెప్పారు. హింసా చర్యలకు పాల్పడితే సచివాలయాలలోని మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ మాట్లాడుతూ కుటుంబంలో మగ, ఆడ పిల్లలను సమానంగా పెంచాలని చెప్పారు. మహిళా రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని, కుటుంబ పరిపాలనలో మహిళలకు కీలకంగా ఉంటారన్నారు. విపత్కర పరిస్థితులలో ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలన్నారు. ముందుగా అతిథులు చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు సూర్యలక్ష్మి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, పలువురు సిడిపిఒలు, కళాశాల విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు తత్కాల్ గడువు పెంపు

ప్రజాశక్తి - అరకులోయ : 2022 - 23 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి తత్కాల్ గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశానికి డిసెంబరు 11 వరకు, ప్రవేశ రుసుము చెల్లించుటకు డిసెంబరు 12 నుంచి 13 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశ రుసుముతో పాటు పదోతరగతికి రూ 300లు, ఇంటర్‌కు రూ 400 అదనంగా తత్కాల్ రుసుము చెల్లించాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందనపై ప్రజలకు నమ్మకం కలగాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ, జెసి, అధికారులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: స్పందనపై ప్రజలకు నమ్మకం కలిగేలా గిరిజన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల గ్రామాలకు వెళ్లి లబ్దిదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాల క్రిష్ణతో కలిసి ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 65 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంపై పలు సూచనలు చేసారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్పందన రిజిస్టర్ ఏర్పాటు చేసి స్పందనలో వచ్చిన ఫిర్యాదులు నమోదు చేయాలని చెప్పారు. కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. పెదబయలు మండలం పెద కోడాపల్లి పంచాయతీ తులభరంగి, కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు గ్రామాలలో కమ్యూటీ భవనాలు నిర్మించాలని పెదబయలుకు చెందిన ప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. జికె వీధి మండలం గూడెం కొత్తవీధి పంచాయతీకి చెందిన నూతి బంద గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పి.రమేష్, వి.చిన్నారావు, కొర్రా క్రిష్ణ తదితరులు వినతి పత్రం అందజేసారు. హుకుంపేట మండలం లోచలిపుట్టు, ఎగసంతారి గ్రామాలలో లో వోల్టేజి సమస్య ఉందని ఆయా రెండు గ్రామాలకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో వోల్టేజి సమస్యను పరిష్కరించాలని సంతారి గ్రామ సర్పంచ్ పాడి అప్పలనాయుడు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.దయానిధి, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్ఎం రాజు, డిఎంహెచ్ఒ జమాల్ భాషా, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, ఆర్‌డబ్ల్యూ ఇఇ లీలాక్రిష్ణ, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, డిఆర్‌డిఎ పిడి మురళి, డ్వామా పిడి రమేష్ రామన్, పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటుకు సిపిఎం వినతి

పాడేరు:డుంబ్రిగూడ మండలం కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా కమిటీ సభ్యుడు, సిపిఎం మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ ఏర్పాటును విన్నవిస్తూ శుక్రవారం ఆయన పాడేరు ఐటిడిఏ లోని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలకు హాస్టల్ సౌకర్యం లేనందున ప్రస్తుతం సమీపంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిపి హై స్కూల్ విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, గత ఏడాది ఈ పాఠశాలలో టెన్త్ ఉత్తీర్ణత 83 శాతం పైగా ఉందని మండలంలోని రెండవ స్థానం వచ్చిందని తెలిపారు. ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధ హాస్టల్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మరింత సౌలభ్యం కలుగుతుందని అన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఈ పాఠశాల ప్రగతిపై అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్‌పి సతీష్ కుమార్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ప్రమాదాలు జరగ కుండా ట్రాఫిక్ నియంత్రణ కోసమే ప్రత్యేక ట్రాఫిక్ కంట్రోల్ హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం అరకులోయ నాలుగు రోడ్డు కూడలి వద్ద అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు ఆధ్వర్యాన ఎస్పీ సతీష్ కుమార్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.అరకులోయ ప్రముఖ పర్యాటక కేంద్రం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, దీంతో ట్రాఫిక్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. పర్యాటక ప్రదేశాలైన పద్మావతి బొటానికల్ గార్డెన్, ట్రైబల్ మ్యూజియం, బొర్రా గుహలు, కాపీ మ్యూజియం వద్ద పోలీసు హెల్ప్ లైన్ డస్క్ ఏర్పాటు చేసి పర్యాటకులకు పలు సూచనలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శుక్రవారం, శనివారం, ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారని ట్రాఫిక్ నియంత్రణ లేక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, అరకువేలి, అనంతగిరి, డుంబ్రిగుడ ఎస్ఐలు సంతోష్, సతీశ్, రాము, ఎంపిటిసి ఎల్బీ బీమరాజు, డి.ఆనంద్ కుమార్, మాజీ ఎంపిటిసి పొద్దు అమ్మన్న, వైసీపీ నాయకులు చెట్టి అప్పాలు, పోలీసులు పాల్గొన్నారు.

సరియా జలపాత అభివృద్ధికి చర్యలు : ఎస్‌పి


కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్‌పి

అనంతగిరి:మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సరియా జలపాతం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎస్పీ. సతీష్ కుమార్ సూచిచారు. శుక్రవారం సరియా జలపాతంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలపాతంలో సుమారు 28 .మంది మృత్యువాత పడ్డారని, ప్రమాదం జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ ఉన్న బండరాళ్లను తొలగించి ప్రమాద నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపించిన అనంతగిరి పోలీసులకు అభినందనలు తెలిపారు. రహదారి అభివృద్ధికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ పరిస్థితిని వివరిస్తానని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అరుకు సర్కిల్ సిఐ.జీడీ బాబు, ఎస్సై .రాము, హెడ్ కానిస్టేబుల్ కిరణ్, స్థానిక సర్పంచ్ మాధవి, మాజీ సర్పంచ్ రంశాల రాంబాబు, కో ఆప్షన్ సభ్యులు శెక్. మదీనా, మహిళా పోలీస్ ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన


వరి కుప్పలు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మాండూస్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అంది వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఈ ఏడాది 6400 ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేపట్టారు. ఎకరాకు సుమారు 30 వేలకు పైగా అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. ఇప్పటికే మండలంలో 2000 ఎకరాలకు పైగా కోతలు కోశారు. కుప్పలు వేయడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో తుపాన్ రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. కోతల కోసి పంట పొలంలో ఆరబెట్టిన పంటను శుక్రవారం రైతులు ప్లాస్టిక్ బరకాలు కప్పుకొని పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు. మరికొందరు రైతులు ఆధారాబాదరగా కుప్పలు వేశారు.

'మధ్యాహ్నం' మెనూ అమలు చేయాల్సిందే..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర


మాట్లాడుతున్న సుభద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు భోజనం అందించాల్సిందేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశుసంక్షేమం, వ్యవసాయం, డ్వామా, బిసి, ఎస్‌సి సంక్షేమం, హౌసింగ్ పథకాలకు సంబంధించి మండలాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు - నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు వారి పరిధిలో ఉన్న పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గ్రామాలలో ఉన్న పిహెచ్‌సిలలో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లను నియమించాలని, వైద్య ఆరోగ్య శాఖాధికారిని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యన్నారాయణ, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాల రూపకల్పనే లక్ష్యం

ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా వెళ్లాలంటే గ్రామ సభలు, సమావేశాలు గ్రామాలలో నిర్వహించాలని సుభద్ర అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ప్రణాళికా ప్రచారం - 2022 కార్యక్రమంలో భాగంగా జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ చట్టం 11వ షెడ్యూల్డులో పేర్కొన్న ప్రభుత్వ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామంతో ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీ చేస్తా

సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాననే విషయం ఇప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు. అయితే సుమారుగా తను ఇండిపెండెంట్ అభ్యర్థిగానే బరిలోకి దిగుతానని చెప్పారు. ఇప్పటివరయిజూ తనని ఏ పార్టీ సంప్రదించలేదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. ఎన్నికల సమయం దగ్గర పడే సమయంలో రాజకీయ పార్టీలు తనని సంప్రదించే అవకాశాలు కూడా లేకపోలేదని పేర్కొన్నారు. 2019 ఎన్నికలలో విశాఖలోనే తాను పోటీ చేసానని, ఆ సమయంలో విశాఖ ప్రజలు తన మీద ఎంతో అభిమానం చూపారని చెప్పారు. తను ఓడిపోయినప్పటికీ ఇక్కడ ప్రజల మనసులో ఒక కుటుంబ సభ్యునిగా చిరస్థాయిగా ఉండిపోయానని తెలిపారు. విశాఖ ప్రజల ప్రేమ మరవలేనని అన్నారు. మళ్లీ తాను ఇక్కడి నుంచే పోటీ చేయాలని తన శ్రేయోభిలాషులు, విశాఖ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే తన టీమ్‌తో చర్చించానన్నారు. చివరగా పార్లమెంట్ సభ్యునిగా విశాఖ నుంచే పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికలలో తన అజెండా ఏంటో స్పష్టం చేశానని అన్నారు. ఇప్పుడు కూడా విశాఖ మంచి కోసం, అభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. తన అజెండాలో చెప్పినవి చేయకపోతే తనపై క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పెట్టవచ్చని చెప్పానని తెలిపారు. తను గెలిస్తే మాత్రం తన అజెండాలో చెప్పినట్లుగా ప్రతిదీ కచ్చితంగా చేసి తీరుతానని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా పలు మార్పులు చోటు చేసుకోనున్నాయని జోస్యం చెప్పారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గిరిజనుల ఆర్థిక పురాభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. పాడేరు మండలం తోటలగొంది, పుట్టమామిడి, వనబంగి, చీడిమెట్ట గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 184 గడపలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఆర్థిక పురోభివృద్ధి ఎలా సాధిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూడున్నర ఏళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమైందని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకోవడం జరిగిందని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.రాంబాబు, వైస్ సర్పంచ్ గెమ్మిలి ఈశ్వరరావు, వ్యవసాయ సలహా మండల చైర్మన్ మినుముల సరస్వతి, వైసిపి మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, సర్పంచ్ లు సోమేలి లక్ష్మణరావు, చిట్టిబాబు, సన్నిబాబు, ఎంపిటిసిలు చిట్టెమ్మ, రామకృష్ణ పాత్రుడు, నాయకులు రామారావు, ఈశ్వరరావు, కన్నాపాత్రుడు, సత్యనారాయణ, కొటారి ఈశ్వరరావు, లింగమూర్తి, సిద్దేశ్వరరావు, జిలుగుల కొండబాబు, కామరాజు, రామ సత్యవతి, సుశీల పాల్గొన్నారు.

తహశీల్దార్ మృతిపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:పెదబయలు తహశీల్దార్ మృతిపై విచారణ చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ తడబరిక సురేష్ కుమార్ కోరారు.పాడేరు పి.ఓ దుర్భాషలాడటంతో మనస్తాపం చెందిన పెదబయలు మండల తహశీల్దార్ ఆత్మహత్య చేసుకున్నట్లు వస్తున్న ఆరోఫణలపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులు ఎంతటి వారైన సరే కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

హుకుంపేటలో ఆయన నివాసం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, అధికారులకు మనోధైర్యం కల్పించి సమర్థవంతమై విధులు నిర్వహణకు తోడ్పాటు ఇవ్వాల్సిన ఉన్నతాధికారులు ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం సరైందికాదన్నారు.

ముంచింగిపుట్టు:ఐటీడీఏ పీవో దుర్భాసలాడటంతోనే పెదబయలు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జి, జిల్లా ఎస్పీతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు.

స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఇటీవల పాడేరు ఐటిడీఏలో పిఓ నిర్వహించిన సమీక్ష సమావేశంలో జగనన్న రీ సర్వేలో శాశ్వత భూమి హక్కు సర్వే నిర్వహణలో పురోగతి లేదని పెదబయలు తహశీసిల్దార్‌ను దుర్భాషలాడటంతోనే మనస్థాపం చెంది మృతి చెందినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఉన్నత అధికారులు ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని మండిపడ్డారు. లోతుగా విచారణ జరిపించి కఠిన చర్యలు ఉండే విధంగా విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ 1 సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు రామదాసు, గణపతి, భీమన్న, డోంబ్రు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన


పాఠశాల స్థలం పరిశీలిస్తున్న ఎంపిటిసి, హెచ్ఎం, తదితరులు

ప్రజాశక్తి-పెదబయలురూరల్‌మండలంలోని పొయిపల్లి పంచాయతీ గల్లెలపుట్టు గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో పాకలో సుమారుగా 38 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. పలుసార్లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉన్నత స్థాయి అధికారులను కలిసి తమ గ్రామంలో నూతన పాఠశాల భవనం మంజూరు చేయాలని కోరారు. భవనం నిధులు మంజూరు కావడంతో శుక్రవారం సచివాలయం సిబ్బంది సమక్షంలో స్థలం పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పోయిభ పుర్ణారావు, సెక్రటరీ పి.కృష్ణారావు, ప్రధాన ఉపాధ్యాయలు జీ.వీరన్న మాష్టర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వక్తలు

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సాక్షి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.ఆరోగ్య రాజు అధ్యక్షతన స్థానిక అనంత చక్రరావు జూనియర్ కాలేజ్‌లో శుక్రవావారం మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్ ఎన్‌జిఒ ప్రతినిధి బాలు అక్కిస, సీనియర్ పాత్రికేయులు చోడిశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ ఎక్కడైనా ఎప్పుడైనా హక్కుల ఉల్లంఘన జరిగితే తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నైట్ సర్వీసు బస్సుల పునరుద్ధరణ

ప్రజాశక్తి - సీలేరు : మావోయిస్టు పార్టీ వారోత్సవాలు ముగియడంతో సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్లే నైట్ సర్వీసు బస్సులను పునరుద్ధరించారు. ఈ బస్సులను శుక్రవారం రాత్రి నుంచి నడుపుతున్నట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మావోయిస్టుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మధురవాడ, విశాఖపట్నం డిపోలు చెందిన నైట్ సర్వీస్ బస్సులను సుమారు ఎనిమిది రోజు నిలుపుదల చేసినట్లు చెప్పారు.

175 స్థానాలు గెలిచేలా కార్యాచరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలను గెలుచుకునేలా పార్టీ పరంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని టిటిడి చైర్మన్, వైసిపి విశాఖపట్నం ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు.